సాక్షి విశాఖపట్నం

శనివారం : 20 : జూలై : 2024



మెడ్‌టెక్ జోన్‌లో మంత్రి

ఏపీ మెడ్‌టెక్ జోన్‌ను రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. 8లో

సత్యభామ నాట్యం అద్భుతం



సత్యభామా నృత్యోత్సవం సమ్మోహనభరితంగా సాగింది. కళాభారతి ఆడిటోరియంలో నృత్యోత్సవాలు ప్రారంభమయ్యాయి. 8లో

థాయ్‌లాండ్‌కు ఐఆర్‌సీటీసీ టూర్ ప్యాకేజీలు

ఉత్తరాంధ్ర జిల్లాల వారి కోసం విశాఖ నుంచి పలు అంతర్జాతీయ, జాతీయ విమాన ప్యాకేజీలను మొట్టమొదటిసారిగా ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి సావర్కర్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

త్వరితగతిన ప్రాజెక్టులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మెట్రోపాలిటన్ కమిషనర్ రవీంద్ర

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ చేపట్టిన ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని మెట్రోపాలిటన్ కమిషనర్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మల్టీలెవెల్ కార్ పార్కింగ్, ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ వద్ద నిర్మిస్తున్న రైల్ ఓవర్ వంతెన, ఎండాడ, చీమలాపల్లిలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణ పనుల ప్రగతిపై ఆరా తీశారు. ఈ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఈ సమావేశంలో ప్రధాన ఇంజినీర్ భవాని శంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బుల్లయ్య కళాశాలకు ఎన్‌సీసీలో పతకాలు



ఎన్‌సీసీ కేడెట్లను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు పలు ఈవెంట్లలో పతకాలు సాధించారు. ఈనెల 7 నుంచి 16 వరకు ఐఎన్‌ఎస్ విశ్వకర్మలో జరిగిన ఐజీసీ–సీఏటీసీ ఈవెంట్‌లో కళాశాల కేడెట్లు ప్రతిభ చూపారు. 4 (ఏ) నావల్ మెడికల్ యూనిట్‌లోని 9 ఎస్‌బ్ల్యూఎస్ సీనియర్ వింగ్ , 20 ఎస్‌డీఎస్ సీనియర్ డివిజన్‌లో కేడెట్లు పతకాలు సాధించారు. 3(ఏ) నావల్ యూనిట్ నుంచి ఒక కేడెట్ ఫైరింగ్‌లో స్వర్ణ పతకాన్ని సాధించడం విశేషం . ప్రతిష్ఠాత్మకమైన ఐజీసీ 4(ఏ) నావల్ మెడికల్ యూనిట్ కేడెట్లు వరుసగా రెండో ఏడాది గెలుచుకున్నారు. ఈ ట్రోఫీని ఆంధ్ర, తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ (డీడీజీ) అందజేశారు. ఆరుగురు కేడెట్లు ఎన్‌ఎస్‌సీ శిబిరంలో జరిగే శిక్షణకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి. మధుకుమార్ కేడెట్లను ప్రత్యేకంగా అభినందించారు.

జగన్నాథస్వామిస్వామి హుండీ ఆదాయం రూ.19.80 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

దాబాగార్డెన్స్: జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణంలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి దశవతారాల్లో దర్శనమిచ్చిన సంగతి విదితమే. ఉత్సవాలు ముగియడంతో వచ్చిన ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఆలయ కార్య నిర్వహణాధికారి టి.రాజగోపాల్ రెడ్డి, విశాఖ జిల్లా తనిఖీదార్ బి.వసంత్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్.రామకృష్ణ, పి.శ్రీధర్, జె.పరశురాం, డి.హరీష్, ఆర్.వెంకటేష్, మణికుమార్, ఈశ్వరమ్మ, ఆదిలక్ష్మి, సుశీల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రథయాత్ర పదిరోజులకు గాను హుండీ ఆదాయం రూ.19,80,072 సమకూరింది.

44 మంది పాలిటెక్నిక్ విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థినులు

భీమునిపట్నం : భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు 44 మందికి ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) అందించే ప్రగతి స్కాలర్‌షిప్‌లు మంజూరయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. సీఎంఈ విభాగంలో చదువుతున్న 28 మందికి, ఈసీఈలో 15 మందికి, సీఈలో ఒకరికి మంజూరైనట్లు పేర్కొన్నారు. వీరికి మూడు సంవత్సరాల పాటు ఒక్కొక్కరికి ఏడాదికిరూ.50 వేలు చొప్పున అందుతుందన్నారు. వీరితో పాటు 96 మంది విద్యార్థినులకు ఈ స్కాలర్‌షిప్‌లు రెన్యువల్ అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థినులను అభినందించారు.

అప్పన్నా.. వస్తున్నాం..





నేడే సింహ'గిరి ప్రదక్షిణ'

- సిద్ధమవుతున్న భక్తులు
- రేపు ఆలయ ప్రదక్షిణ
- ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నం

సింహాచలం : సింహగిరి ప్రదక్షిణకు సమయం ఆసన్నమైంది. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేంజేసిన 32 కిలోమీటర్ల కొండచుట్టూ ప్రదక్షిణ చేసే సమయం వచ్చింది. ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని శనివారం గిరి ప్రదక్షిణ ఉత్సవం జరగనుంది. ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది వరకు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేశారు. అందుకు తగ్గట్టు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థానం, రెవెన్యూ, జీవీఎంసీ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, విద్యుత్, ఫైర్, ఎక్సైజ్ తదితరశాఖల సమన్వయంతో విశేషంగా ఏర్పాట్లు చేశారు. తుపాన్ కారణంగా ఏర్పాట్లకు అంతరాయం ఏర్పడినా భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆయా ఆశాఖ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఏర్పాట్లు ఇలా...

- గిరి ప్రదక్షిణ మార్గంలో 29 ప్రదేశాల్లో స్టాళ్లు ఏర్పాటు చేశారు. అక్కడ భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు.
- 22 ప్రదేశాల్లో పురుషులకు, మహిళలకు వేర్వేరుగా 290 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.
- 11 ప్రదేశాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.
- 12 ప్రదేశాల్లో 17 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు.
- ఆరు ప్రదేశాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు
- సింహాచలంలోని తొలిపావంచా వద్ద నుంచి శనివారం సాయంత్రం 4గంటలకు పుష్పరథం ప్రారంభమవుతుంది. రథంతో ప్రదక్షిణ ప్రారంభించే భక్తులు ఆ సమయానికి తొలిపావంచా వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది.
- ఉదయం నుంచే పలువురు భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించడం పరిపాటి. దీన్ని దృష్టిలో ఉదయం నుంచే తొలిపావంచా వద్ద భక్తులకు సేవలందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.
- సింహాచలంలోని స్వామివారి తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరి కాయలు కొట్టేందుకు 50 క్యూ లైన్లు, 80 ఇనుమ గడ్డర్లు ఏర్పాటు చేశారు. అలాగే అడవివరం–హనుమంతవాక బీఆర్‌టీఎస్ మార్గంలో కొత్త ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద 20 ఇనుమ గడ్డర్లు ఏర్పాటు చేశారు.
- దారి పొడవునా భక్తులకు పలు స్వచ్ఛంధ సంస్థలుఆహార పదార్థాలు, పానియాలు, స్నాక్స్ అందించనున్నాయి.
- కొండచుట్టూ ఏర్పాటు చేసిన స్టాళ్లల్లో జీవీఎంసీ తాగునీరు అందిస్తుంది. అలాగే పారిశుధ్యం,మరుగుదొడ్ల నిర్వహణ చేస్తుంది.
- ఆదివారం కేవలం కొండపైకి వెళ్లే భక్తులను మాత్రమే సింహగిరి మెట్లమార్గంలో అనుమతి ఇస్తారు. కొండదిగువకు అనుమతించరు. ఆరోజు ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొండదిగువకి వచ్చే భక్తులను దేవస్థానం బస్సుల్లో ఉచితంగా చేరవేస్తారు.



సింహాచలం ప్రధాన ద్వారం

భక్తులు ప్రదక్షిణ చేసే మార్గం

సింహాచలంలోని తొలి పావంచా, అడవివరం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్క్, అప్పుఘర్, ఎంవీపీకాలనీ, సీతమ్మధార, నరసింహనగర్, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పరాడ, మురళీనగర్, మాధవధార, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, లక్ష్మీనగర్, కుమారి కల్యాణ మండపం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకోవాలి.



దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన

దర్శన సమయాలు

శనివారం ఉదయమే గిరి ప్రదక్షిణ ప్రారంభించి ఆదేరోజు రాత్రి చేరుకునే భక్తులకు రాత్రి 10గంటల వరకు స్వామివారి దర్శనాలు లభిస్తాయి. ఆదివారం ఉదయం 5.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేస్తారు. తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు, రాత్రి 8.30గంటల నుంచి 9గంటల వరకు దర్శనాలు లభిస్తాయి.

రేపు ఆలయ ప్రదక్షిణలు

- ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సింహగిరి ఆదివారం ఆలయ ప్రదక్షిణలు జరగనున్నాయి. ఉదయం 3గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతిస్తారు. ఆలయ బాహ్య ప్రకారం చుట్టూ 400 మీటర్ల మేర ప్రదక్షిణ చేయాల్సి ఉంటుంది.
- అప్పుఘర్ వద్ద స్నానాలు ఆచరించే భక్తుల సౌకర్యార్థం 40 తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరం, 80 ఎల్‌ఈడీ దీపాలు, ఒక జనరేటర్, ఒక పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. 20 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. వీరంతా పలు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించనున్నారు.
- మాధవధార వద్ద 40 తాత్కాలిక మరుగుదొడ్లు, ఒక వైద్య శిబిరం, 50 ఎల్‌ఈడీ దీపాలు, జనరేటర్‌ని అందుబాటులో ఉంచారు. ఒక పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు.
- కొండదిగువ, 29, కొండపైన 3 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించారు.
- 21న సింహగిరిపై అన్నప్రసాద భవనంలో భక్తులందరికీ నిర్విరామంగా కదంబం, దద్దోజనం అందజేస్తారు.
- సుమారు లక్ష లడ్డూలను విక్రయానికి సిద్ధం చేశారు.
- 21న జరిగే ఆలయ ప్రదక్షిణలకు సంబంధించి ఉత్తర రాజగోపురం వద్ద, దక్షిణ రాజగోపురం వద్ద వంతెలను ఏర్పాటు చేశారు. ఆ వంతెనల పై నుంచి ఆలయ ప్రదక్షిణలు చేసే భక్తులను, వంతెనల కింద నుంచి దర్శనాలకు అనుమతించనున్నారు.
- నగర సీపీ సంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీసులు గిరి ప్రదక్షిణ బందోబస్తు నిర్వహించనున్నారు.
- **పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంలు ఏర్పాటు చేసే ప్రదేశాలు :** సింహాచలంలోని కొండదిగువ కలశం జంక్షన్, అడవివరం, హనుమంతవాక, అప్పుఘర్, మాధవధార, ఎన్‌ఎస్‌టీఎల్

గిరి ప్రదక్షిణ మార్గంలో ఏదైనా అత్యవసర పరిస్థితిలో భక్తులు

సంప్రదించాల్సిన నంబర్లు

సింహాచలం దేవస్థానం
0891-2954944, 9390501082

జీవీఎంసీ కమాండ్ కట్రోల్ సెంటర్
1800-42500009

వాటర్ సప్లై, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్
0891-2869111

విశాఖ పోలీస్
9390105353, 9330105355

2600 మందితో భద్రతా ఏర్పాట్లు



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: గిరి ప్రదక్షిణకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం 2600 పోలీస్ అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నారు. శని, ఆదివారాలు జరిగే ఈ గిరిప్రదక్షిణలో భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బందోబస్తు అధికారులకు పలు సూచనలు చేశారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సిబ్బంది పూర్తి సమన్వయంతో గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులతో పాటు నగర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా వేడుక జరిగేలా విధులు నిర్వర్తించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-2 తుహిన్ సిన్హా, డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో గిరి ప్రదక్షిణ విజయవంతం చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో మేయర్ హరి వెంకట కుమారి, జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్, దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : గిరి ప్రదక్షిణ ఉత్సవాన్ని అధికారులంతా సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. సింహగిరిపై గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను శుక్రవారం నగర మేయర్ హరి వెంకట కుమారి, జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. సింహగిరిపై ఏర్పాటు చేసిన క్యూ లైన్లు, ఆలయ ప్రదక్షిణల కోసం ఏర్పాటు చేసిన వంతెనలు, కొబ్బరికాయలు కొట్టే ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు సిద్ధంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈతరుణంలోనే శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తులు లఘు దర్శనం చేసుకునే నీలాద్రిగుమ్మం ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆలయ ఉత్తరద్వారం వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు వర్షానికి కారిపోతుండటాన్ని పరిశీలించిన కలెక్టర్ వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని సూచించారు. క్యూ లైన్లలో బురద లేకుండా చూడాలన్నారు. ఈసందర్భంగా దేవస్థానం రూపొందించిన ప్రణాళికను పరిశీలించారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదేశాలు

మహారాణిపేట: సింహాద్రి అప్పన్న గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు చిన్న అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు పూర్తి చేయాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం వివిధ విభాగాల అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జోడుగుళ్ల పాలెం, అప్పుఘర్ వద్ద సముద్ర భాగంలో బోట్లను నిలిపి ఉంచాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

త్వరలో సొంత జిల్లాలకు తహసీల్దార్లు

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల ముందు బదిలీ అయిన తహసీల్దార్లు, ఇతర అధికారులను తిరిగి సొంత జిల్లాలకు పంపడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. శుక్రవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్లు స్థానికంగా ఉండరాదన్న నిబంధనతో ఈ ఏడాది జనవరి 31న విశాఖ నుంచి మొత్తం 19 మందిని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు బదిలీ చేశారు. అలాగే అక్కడి నుంచి 19 మంది తహసీల్దార్లు విశాఖలో విధుల్లో చేరారు. విశాఖ నుంచి 9 మంది పార్వతీపురం మన్యం జిల్లాకు, 9 మంది విజయనగరం జిల్లాకు, ఒకరు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

కోయంబత్తూర్–దానాపూర్ మధ్య వన్‌వే స్పెషల్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం కోయంబత్తూర్–దానాపూర్ మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. కోయంబత్తూర్–దానాపూర్ (06185) స్పెషల్ ఈ నెల 21న రాత్రి 11.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు రాత్రి 8.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.15గంటలకు బయలుదేరి మంగళవారం అర్ధరాత్రి(బుధవారం తెల్లవారు) దాటిన తర్వాత 1.30 గంటలకు దానాపూర్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు 15–స్లీపర్ క్లాస్, 2–సెకండ్ క్లాస్ లగేజీ కం దివ్యాంగ కోచ్‌లతో నడుస్తుంది.

విశ్వవిద్యాలయంలోనూ విధ్వంసకాండ

- పరిపాలన భవనం వద్ద గేట్లు తొలగింపు
- ఎంపీల ఆదేశాలను పాటించిన ఏయూ ఇన్‌చార్జ్ వీసీ
- అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద భద్రతా గేట్లు తొలగించిన వైనం



గేట్లు తొలగింపును పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ శశిభూషణరావు



భద్రత కోసం ఏర్పాటు చేసిన గేట్లు తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం : అత్యంత ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా.. ఏర్పాటు చేసిన భద్రతా వలయాన్ని సైతం కూటమి ప్రభుత్వం ధ్వంసం చేసింది. ఎందరో మహానుభావులు బాధ్యతలు చేపట్టిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి భవనంలోకి ఆందోళనకారులు రాకుండా ఉండేలా ఏర్పాటు చేసిన గేట్లను తొలగిస్తూ.. పవిత్రమైన విద్యాలయంలోనూ విధ్వంసకాండ మొదలుపెట్టేశారు. ఏయూ పరిపాలన భవనం వద్ద శుక్రవారం ఉదయం విద్యార్థులు సైతం విస్మయానికి గురిచేసే వాతావరణం కనిపించింది. ఏయూ ప్రధాన గేటుకు సమీపంలో అడ్మినిస్ట్రేటివ్ భవనం ఉంది. ఈ గేటు వద్ద ధర్నాలు చేసే విద్యార్థి సంఘాలు, ఆందోళనకారులు నేరుగా చొచ్చుకొని వచ్చి.. ఈ బిల్డింగ్‌లోకి రాకుండా గత వీసీ హయాంలో భద్రతా వ్యవస్థను పటిష్టం చేసేందుకు గేట్లను ఏర్పాటు చేశారు. నాక్ బృందం పర్యటనకు వచ్చినప్పుడు ఈ భద్రతా వ్యవస్థను చూసి అభినందనలు సైతం తెలిపింది. ప్రతి యూనివర్సిటీ ఈ తరహాలో ఏర్పాటు చేస్తే బావుంటుందని కితాబిచ్చింది. కానీ విధ్వంసమే తమ ప్రధాన అజెండాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ఈ వాతావరణం నచ్చలేదు.

టీడీపీ, బీజేపీకి చెందిన ఇద్దరు ఎంపీలు గేట్లను తొలగించాలంటూ ఆదేశించారు. అంతే గురువారం రాత్రి ప్రమాణ స్వీకారం చేసిన ఇన్‌చార్జ్ వీసీ శశిభూషణరావు.. ఆ భద్రతా వలయం వల్ల పరిపాలన భవనానికి మేలేంటి అని కనీసం ఆలోచించకుండా ఎంపీల ఆజ్ఞను తూచా తప్పకుండా పాటించేశారు. జోరున వర్షం పడుతున్నా.. విధ్వంసమే తన తొలి అడుగు అని భావించిన వీసీ గేట్ల తొలగింపు ప్రక్రియను ప్రారంభించారు. ఈ పనులను వీసీ దగ్గరుండి మరీ పర్యవేక్షించారు. రోడ్డు పక్కనే ఈ భవనం ఉండటంతో.. ఒకప్పుడు విశ్వవిద్యాలయం ఆవరణలోకి పశువులు సైతం వచ్చేవి. అవి నేరుగా ఈ భవనం వైపు వెళ్లిపోయేవి. ఈ గేట్లను ఏర్పాటు చేసిన తర్వాత సెక్యూరిటీ సిబ్బందికి సైతం పశువులను యూనివర్సిటీలోకి రాకుండా నిలువరించడం సులువుగా మారింది. ఫలితంగా యూనివర్సిటీకి వచ్చే విద్యార్థులు, ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్స్‌కు ఈ మూగజీవాల వల్ల కలిగే ఇబ్బందులు సైతం దూరమయ్యాయి. ఇలా అన్ని రకాలుగా ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గేట్లను సైతం వీసీ దగ్గరుండి మరీ తొలగించడాన్ని ఏయూ విద్యార్థులు, ప్రొఫెసర్లు తప్పుపడుతున్నారు. ఉపకులపతి స్థాయిలో ఉంటూ ఈ తరహా పనులతోనే తన విధుల్ని ప్రారంభించడంపై మండిపడుతున్నారు. ఇకపై విద్యార్థులెవ్వరైనా నేరుగా పరిపాలన భవనానికి రావొచ్చంటూ ఇన్‌చార్జ్ వీసీ శశిభూషణరావు ప్రకటించడాన్ని విద్యార్థిలోకం గర్హిస్తోంది.



రామకృష్ణ థియేటర్ వద్ద పొంగిన మ్యాన్‌హోల్

విశాఖలో కుండపోత

- గురువారం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం
- అల్పపీడనం వాయుగుండంగా మారడంతోనే..
- షీలానగర్‌లో అత్యధికంగా 10 సెం.మీ.
- శనివారం మధ్యాహ్నానికి తెరిపిచ్చే అవకాశం

8లో



నీటమునిగిన చావులమదుం జంక్షన్

ఆలస్యంగా సంత్రగచ్చి-బెంగళూరు స్పెషల్

తాటిచెట్లపాలెం: సంత్రగచ్చిలో శుక్రవారం రాత్రి 7 గంటలకు బయలుదేరాల్సిన సంత్రగచ్చి-ఎస్ఎంవీ బెంగళూరు(08845) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా బయలుదేరింది. పెయిరింగ్ రైలు ఆలస్యంతో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు బయలుదేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఎస్‌బీఐ బ్రాంచ్‌లో షార్ట్ సర్క్యూట్



వెల్లంకి ఎస్‌బీఐ బ్రాంచ్ నుంచి వస్తున్న పొగలు


బ్రాంచ్‌లో పొగచూరిన విద్యుత్ ఉపకరణాలు, గోడలు

తగరపువలస: ఆనందపురం మండలం జాతీయరహదారిని ఆనుకుని ఉన్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లంకి బ్రాంచ్‌లో శుక్రవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో బ్రాంచ్ అంతా పొగలు కమ్ముకున్నాయి. స్థానికులు ప్రమాద విషయాన్ని పసిగట్టి ఆనందపురం పోలీస్ స్టేషన్, భీమిలి మండలం తాళ్లవలస అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో సకాలంలో బ్యాంకు వద్దకు చేరుకుని పొగలను అదుపు చేశారు. యూపీఎస్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం చోటు చేసుకున్నట్టు అగ్నిమాపకశాఖాధికారి జి.శ్రీనివాసరాజు తెలిపారు. ఎలాంటి ఆస్తి నష్టం సంభవించలేదని బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. మొదటి ఫ్లోర్‌లోని ఇన్వర్టర్, డాక్యుమెంట్లకు కూడా ఎలాంటి నష్టం జరకగపోవడంతో బ్రాంచ్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

ఖైదీలు, బాల నేరస్తుల్లో పరివర్తనకు చర్యలు

బీచ్‌రోడ్డు: ఖైదీలు, బాల నేరస్తుల్లో పరివర్తనలో భాగంగా ఇండియన్ ఆయిల్ 'పరివర్తన్- ప్రిజన్ టు ప్రైడ్' ఎనిమిదో దశ, 'నయీ దిశ – స్మైల్ ఫర్ జువైనల్' ఐదో దశ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ చైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య ఓ ప్రకటనలో మాట్లాడుతూ 22 జైళ్లు, జువైనల్ హోమ్‌లలో వెయ్యి మందికి పైగా వ్యక్తుల జీవితాలను ఈ దశలో స్పృశించనున్నట్లు వివరించారు. 23 రాష్ట్రాలు, ఆరు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 15 మహిళా బాల్య కేంద్రాలతో సహా 150 సంస్థల్లో 7,300 మంది ఖైదీలు, బాలలకు స్పోర్ట్స్ కోచింగ్, పరికరాలను అందించడానికి సిద్ధం ఉన్నామన్నారు. 'పరివర్తన్', 'నయీ దిశ' ద్వారా ఖైదీలు కొత్త జీవితంలోనికి అడుగు పెట్టేందుకు తగిన కృషి చేస్తున్నట్లు తెలిపారు.


బౌడారా రోడ్డులో వర్షపు నీట్లో రిక్షా కార్మికుడు


చావులమదుం వంతెన వద్ద వాహనచోదకుడి ఇక్కట్లు


ఆశీలమెట్ట జంక్షన్‌లో రోడ్లపైకి చేరిన వరద నీరు

విశాఖిలో కుండపోత


మధురవాడ వికలాంగుల కాలనీలో జారి పడిన మట్టి


నీట మునిగిన వెలంపేట రోడ్డు


కాకానినగర్ వద్ద హైవేపై కూలిన భారీ చెట్టు

విశాఖ సిటీ: వాయుగుండం బలపడడంతో విశాఖలో కుండపోత వర్షం కురిసింది. గురువారం నుంచి ఎడతెరిపివ్వకుండా జోరు వానతో జనజీవనం స్తంభించింది. దీంతో శుక్రవారం కాలువలు పొంగిపొర్లాయి. రోడ్లు జలమయమయ్యాయి. గడిచిన 24 గంటల్లో అనేక ప్రాంతాల్లో 5 సెంటీమీటర్ల కంటే అత్యధిక వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలు కారణంగా కలెక్టర్ హరేందిర ప్రసాద్ శుక్రవారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో తుపాను కంట్రోల్ రూములను ఏర్పాటు చేశారు. 0891-2590102, 0891-2590100 ఫోన్ నంబర్లతో ఈ సెంటర్ పనిచేస్తోంది. వీటి ద్వారా తుపాను పరిస్థితుల సమాచారాన్ని ప్రజలు పొందవచ్చు. అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని తాజా పరిస్థితులను తెలియజేయవచ్చు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

భారీ వర్షాలు కారణంగా నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. లక్ష్మీటాకీస్, కాన్వెంట్ జంక్షన్, జ్ఞానాపురం, వెలంపేట, దుర్గాలమ్మగుడి, పూర్ణామార్కెట్, రైల్వే న్యూకాలనీ, కేఆర్ఎం కాలనీ ప్రాంతాల్లో రహదారులు నీట మునిగాయి.

షీలానగర్‌లో అత్యధికం: నగరంలో గడిచిన 24 గంటల్లో షీలానగర్‌లో 10.5 సెం.మీ. వర్షం కురిసింది. హెచ్‌బీ కాలనీలో 7.8 సెం.మీ., ఆరిలోవలో 7.8 సెం.మీ., మహారాణిపేటలో 7.7 సెం.మీ., అప్పన్నపాలెం 6.8 సెం.మీ., పెదగంట్యాడలో 5.6 సెం.మీ., సీతమ్మధారలో 5.3 సెం.మీ., అగనంపూడిలో 4.7 సెం.మీ., సింహాచలంలో 4.5 సెం.మీ., వాంబే కాలనీలో 3.5 సెం.మీ., కాపులుప్పాడలో అత్యల్పంగా 2.1 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

విద్యుత్ సమస్యల ఫిర్యాదులకు 7382249881

ఉమ్మడి విశాఖలో భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సమస్యల ఫిర్యాదుల కోసం ఏపీఈపీడీసీఎల్ ప్రత్యేక నంబర్‌ను 7382249881 అందుబాటులోకి తీసుకువచ్చింది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో విద్యుత్ స్తంభాలు పాడైనా, వైర్లు తెగిపడినా, ఏదైనా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేకపోయినా, అపరిష్కృత దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలపై ఆ నంబర్‌కు మెసేజ్ లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఎప్పటిలాగే కాల్ సెంటర్ నంబర్ 1912కు చేసి అనంతరం 9 డయల్ చేసి వినియోగదారుడు నేరుగా సమస్యను తెలపవచ్చని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ సూచించారు. విద్యుత్ సరఫరా పర్యవేక్షణ కోసం ఆపరేషన్ డివిజన్ పరిధిలలో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

హైవేలో కూలిన చెట్లు

విశాఖ విద్య: జాతీయ రహదారిపై కాకానినగర్ వద్ద భారీ వృక్షం కూలి రోడ్డుపై పడింది. దీంతో హైవేపై కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. చెట్టు కూలిన సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసు, జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. రహదారిపై పడిన చెట్టును తొలగించడంతో వాహన రాకపోకలు యథావిధిగా సాగాయి.

కొండవాలులో భయంభయం

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు వికలాంగుల కాలనీలో ఓ నివాసానికి ఆనుకుని మట్టి జారిపడింది. దీంతో అక్కడి నివాసితులు ఆందోళన చెందుతున్నారు.

నష్టం జరగకుండా చర్యలు తీసుకోండి

మహారాణిపేట: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చోటు చేసుకున్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శుక్రవారం సమీక్షించారు. ఎటువంటి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలు.. తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ముఖ్యమంత్రికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అల'జడి

- కోతకు గురైన రుషికొండ తీరం
- పరదేశిపాలెం వంతెనపైకి వరద నీరు


కోతకు గురైన రుషికొండ బీచ్

కొమ్మాది: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తీరం అల్లకల్లోలంగా మారింది. భీమిలి బీచ్ రోడ్డులో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి జీవీఎంసీ 4వ వార్డు పరదేశిపాలెం గెడ్డపై పెద్ద ఎత్తున వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో శుక్రవారం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ ఉన్న అరటి తోట నీట మునిగింది. వరద నీరు ప్రభావంతో పరదేశిపాలెం నుంచి మధురవాడ జాతీయ రహదారికి, కాపులుప్పాడకు రాకపోకలు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు భీమిలి, ఉప్పాడ, మంగమారిపేట, రుషికొండ ప్రాంతాల మత్స్యకారులు చేపల వేటకు విరామం చెప్పారు. తమ పడవలు, బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రుషికొండ బీచ్‌లో సముద్రం ముందుకు రావడంతో పాటు భారీగా తీరం కోతకు గురైంది. సముద్రంలో కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడడంతో పర్యాటకులను లైఫ్ గార్డ్స్, మెరైన్ పోలీసులు అప్రమత్తం చేశారు.


చెరువును తలపిస్తున్న పరదేశిపాలెం రోడ్డు

విరిగిన విద్యుత్ స్తంభం


సుందర్‌నగర్ కొండవాలులో ఓ ఇంటి ముందు విరిగిపోయిన విద్యుత్ స్తంభం


కొండపై పక్కకు వాలిన విద్యుత్ స్తంభం

ఆరిలోవ: జోరుగా కురుస్తున్న వర్షాలకు ఆదర్శనగర్ ప్రాంతం సుందర్‌నగర్ కొండవాలులో ఓ విద్యుత్ స్తంభం రెండు ముక్కలై.. ఓ ఇంటి ముందు పడింది. ఈ ఘటనలో ఎవ్వరికీ ఏం కాలేదు. మరో స్తంభం పక్కకు వాలిపోయి ప్రమాదకరంగా మారింది. శిథిలావస్థకు చేరిన వీటిని తొలగించి.. కొత్త స్తంభాలు వేయాలని కొన్ని రోజులుగా జీవీఎంసీ అధికారులను కోరుతున్నా.. పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

పరిశ్రమల్లో భద్రతకు ప్రాధాన్యం


శిక్షణలో మాట్లాడుతున్న ఓంకుమార్

బీచ్‌రోడ్డు: సీఐఐ ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం 'పరిశ్రమల్లో సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ' అనే అంశాలపై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. పని చేసే ప్రాంతాల్లో ప్రమాదాలు, రిస్క్ అసెస్‌మెంట్, కంట్రోల్స్, క్లిష్టమైన ప్రక్రియపై ఈహెచ్ఎస్ మేనేజర్ ఎం.ఓం కుమార్ శిక్షణ ఇచ్చారు. ఇండ్రస్ట్రియల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావాలను వివరించారు. పరిశ్రమల్లో భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో అజినోమోటో వైస్ ప్రెసిడెంట్ పీఎస్ ఠాగూర్, హ్యాక్ ల్యాబ్ సొల్యూషన్స్ హెడ్ బాల్‌రాజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముడసర్లోవ వద్ద రైల్వే స్థలం పరిశీలన


ముడసర్లోవ వద్ద రైల్వేకు కేటాయించిన స్థలం వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఆరిలోవ: ముడసర్లోవ వద్ద డంపింగ్ యార్డు వెనుక రైల్వే శాఖకు జీవీఎంసీ కేటాయించిన స్థలాన్ని శుక్రవారం రైల్వే, జీవీఎంసీ జోన్-2 అధికారులు పరిశీలించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో రైల్వే శాఖకు చెందిన స్థలాలను రోడ్లు వేయడానికి జీవీఎంసీ కొన్నేళ్ల కిందట తీసుకుంది. ఇందుకు బదులుగా ముడసర్లోవ వద్ద సర్వే నంబర్ 26లో 52 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ స్థలాన్ని శుక్రవారం రైల్వే శాఖ అధికారులు సాయి అనుభవ్‌నాథ్, డి.ఎ.ఎన్. ఎస్.కె సింగ్, జోన్-2 ఏసీపీ సబ్‌నాస్ శాస్త్రి సిబ్బందితో కలసి పరిశీలించారు. మ్యాప్ పరిశీలించి ఆ స్థలం హద్దులు తెలుసుకున్నారు.

మెడ్‌టెక్ జోన్‌ను సందర్శించిన మంత్రి కొండపల్లి

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు మదీనాబాగ్ సమీపంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌ను రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. మెడ్‌టెక్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. అక్కడ వివిధ కంపెనీల ఆపరేషన్స్‌కు సంబంధించిన ప్రక్రియల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య పరికరాల తయారీ కంపెనీలను సందర్శించి, ఆయా సీఈవోలతో మంత్రి భేటీ అయ్యారు. అక్కడున్న వసతు లు, ఉద్యోగులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు కంపెనీల సీఈవోలు, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన పరిశ్రమల శాఖ అధికారులు గణపతి, శ్రీధర్ పాల్గొన్నారు.

ఇద్దరు ఏఎంసీ వైద్యులకు బహుమతులు


విజేతలు సంగీత కుమారి, రాందాస్‌ను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: అసోసియేషన్ ఆఫ్ మెడికల్ బయో కెమిస్ట్స్ ఆఫ్ ఇండియా(ఏఎంబీఐ) రాష్ట్ర సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ(ఏఎంసీ) వైద్యులు బహుమతులు సాధించారు. ఏఎంసీ బయో కెమిస్ట్రీ విభాగంలో డాక్టర్ రాందాస్ పీజీ పోస్టర్ ప్రదర్శనలో ప్రథమ బహుమతి, డాక్టర్ సంగీత కుమారి రెండో బహుమతి గెలుచుకున్నారు. ఏఎంబీఐ రాష్ట్ర సమావేశాలు ఈ నెల 11 నుంచి 13 వరకు మంగళగిరిలోని ఏఐఐఎంఎస్‌లో జరిగాయి. ఏఎంబీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బయోకెమిస్ట్రీకి చెందిన డాక్టర్ పి.విజయ రాధిక ఎన్నికయ్యారు. ఈ మేరకు విజేతలను శుక్రవారం ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు బయోకెమిస్ట్రీ హెచ్‌వోడీ వి.భవాని అభినందించారు.



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.115
స్కిన్	: రూ.200
స్కిన్‌లెస్	: రూ.210

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	550.00
విజయనగరం	554.00
శ్రీకాకుళం	554.00

ఆకట్టుకుంటున్న 'సూత్ర' ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌లో వస్త్రాలు పరిశీలిస్తున్న సందర్శకులు

బీచ్‌రోడ్డు: విభిన్న రకాల దుస్తులు, ఆభరణాలు, సౌందర్య ఉత్పత్తులు, గృహ అలంకరణ సామగ్రి, గిఫ్ట్ వస్తువులు, ఉపకరణాలు తదితర వాటితో ఏర్పాటు చేసిన సూత్ర ఎగ్జిబిషన్ నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నోవాటెల్‌లో శుక్రవారం ఈ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. దేశం నలుమూలల నుంచి ఎంపిక చేసిన విభిన్న రకాల డిజైన్లతో తాజా వస్త్రాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ముంబయి, ఢిల్లీ, కోల్‌కతా, నాగ్‌పూర్, రాయపూర్, బెనారస్, ఉజ్జయిని, భోపాల్, గోవా, బెంగళూరు తదితర నగరాల నుంచి సేకరించిన లైఫ్‌స్టైల్ బ్రాండ్లు ప్రదర్శించినట్లు వివరించారు. ఆధునిక ఫ్యాషన్ ప్రపంచానికి దీటుగా.. ఎన్నో సొగసైన వస్త్ర సముదాయంతా ఒకే చోట అందుబాటులో ఉందని, ఎగ్జిబిషన్‌ను సందర్శించి ప్రతి ఒక్కరూ షాపింగ్ అనుభూతి పొందాలని నిర్వాహకులు కోరారు. ఈ ప్రదర్శన శనివారం రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

సమ్మోహన భరితం..సత్యభామ నాట్యం


కళాకారిణి నాట్య విన్యాసం


నృత్యోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌కంట్యాక్స్ మాజీ కమిషనర్ రవిశంకర్ నారాయణ

మద్దిలపాలెం: సత్యభామా నృత్యోత్సవం సమ్మోహనభరితంగా సాగింది. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలోమూడు రోజుల పాటు జరిగే నృత్యోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఇన్‌కంట్యాక్స్ మాజీ కమిషనర్ రవిశంకర్ నారాయణ, కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ రమాదేవి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 16 రాష్ట్రాల నుంచి 65 మంది కళాకారిణులు పాల్గొని కూచిపూడి, కథాకళి, భరతనాట్యం ప్రదర్శిస్తూ అబ్బురపరిచారు. ఈ సందర్భంగా కూచిపూడి కళాకారిణి డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక నృత్యప్రదర్శనలు నేటి తరానికి అందించడానికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అకాడమీ వ్యవస్థాపకుడు బత్తిన విక్రమ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో 12 రాష్ట్రాల నుంచి డ్యాన్స్ ఫెస్టివల్ డైరెక్టర్లు పాలొంటున్నారని వెల్లడించారు. కూచిపూడి కళాకారిణి డాక్టర్ సజని వల్లభనేనికి పద్మశ్రీ శోభానాయుడు జాతీయ ఎక్స్‌లెన్స్ అవార్డుతో, కూచిపూడి కళాకారిణి గీతా నారాయణ్ సుధగాణికి సత్యభామ డ్యాన్స్ ఐకాన్-2024 అవార్డుతో సత్కరించారు.

థాయ్‌లాండ్‌కు ఐఆర్‌సీటీసీ టూర్ ప్యాకేజీలు

తాటిచెట్లపాలెం: ఉత్తరాంధ్ర జిల్లాల వారి కోసం విశాఖ నుంచి పలు అంతర్జాతీయ, జాతీయ విమాన ప్యాకేజీలను మొట్టమొదటిసారిగా ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి సావర్కర్ తెలిపారు.

టూర్‌ల వివరాలు..

మేజికల్ థాయ్‌లాండ్ : ఈ టూర్ మొత్తం ఐదు రాత్రులు, ఆరు పగళ్లు. సెప్టెంబరు 7వ తేదీన విశాఖలో మొదలై 12వ తేదీతో ముగుస్తుంది. ఇది విశాఖ నుంచి ప్రత్యేకంగా పరిచయం చేస్తున్న మొదటి అంతర్జాతీయ టూర్. ఈ ప్యాకేజీలో పట్టాయలోని నాంగ్‌నూచ్ గార్డెన్, అల్కజర్ షో, కోరల్ ఐలాండ్, సఫారీ వరల్డ్ టూర్, రాత్రి భోజనంతో కూడిన రివర్ క్రూయిజ్, బ్యాంకాక్‌లోని గోల్డెన్ బుద్ధ, మార్బుల్ బుద్ధ, శ్రీ రాచ టైగర్ జూ వంటి పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు. మొత్తం భోజనాలు, టిఫిన్స్, వసతి (4 స్టార్ హోటల్), ఏసీ సైట్ సీయింగ్, ఇన్సూరెన్స్, అన్నింటితో కలిపి ఒక్కొక్కరికి 57,815(డబుల్, ట్రిపుల్ ఆక్యుపెన్సీ), రూ.66,735 (సింగిల్ ఆక్యుపెన్సీ)

సదరన్ డివైన్ టెంపుల్ టూర్ : ఈ యాత్ర మొత్తం ఐదు రాత్రులు, ఆరు పగళ్లు ఉంటుంది. ఈ టూర్ ఆగస్టు 14న విశాఖలో ప్రారంభమై 19వ తేదీతో ముగుస్తుంది. ఈ టూర్‌లో దక్షిణాదిలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మధురైలోని మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, ధనుష్కోడి, కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేండ్రంలోని శ్రీపద్మనాభస్వామి ఆలయం వంటి దర్శనీయ స్థలాలను సందర్శించవచ్చు. ఈ టూర్‌లో ఒక్కొక్కరికి విమాన టికెట్లు, లోకల్ సైట్‌సీయింగ్, భోజనం, ఏసీ హోటల్ వసతి, ట్రావెల్ ఇన్సూరెన్స్, అన్ని కలిపి రూ. 38,005(ట్రిపుల్, డబుల్ ఆక్యుపెన్సీ), రూ.39,880 (డబుల్ ఆక్యుపెన్సీ), రూ.51,400 (సింగిల్ ఆక్యుపెన్సీ)గా చార్జీలను నిర్ణయించారు. మరిన్ని వివరాలకు విశాఖ రైల్వేస్టేషన్‌లోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ లేదా చందన్ కుమార్(92810 30748), సాయిప్రసాద్(92814 95847), కేవీ రావు(95501 66168)ను సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు కోరారు.